క్లుప్తంగా

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు డిగ్రీ కళాశాల విద్యార్థి

బనగానపల్లె రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్ మహబూబ్‌బాషా సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడని వ్యాయామ అధ్యాపకురాలు విజయకుమారి తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో బెళగంలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి 25వ తేది వరకు జరిగే సౌత్‌జోన్ వాలీబాల్ క్రీడా పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొంటారన్నారు.ఎస్ మహబూబ్ బాషాను కళా శాల అధ్యాపకులు,విద్యార్థులు అభినందించారు.

18 నుంచి అమ్మవార్ల జాతర

డోన్ టౌన్: మండలంలోని ఉడుములపాడులో కొలువైన శ్రీపెద్దమ్మ, శ్రీమారెమ్మ, శ్రీకర్రెమ్మ, శ్రీయల్లమ్మ, శ్రీసుంకులమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, మంగళవారం ఉదయం 7.30గంటల నుండి సామూహిక బోనాలు, పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని దీవెనలు పొందాలని సూచించారు.

యువత వర్కింగ్ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక


చిన్న హుస్సేన్‌బాబు

కోవెలకుంట్ల: దూదేకుల సంఘం నంద్యాల జిల్లా యువత వర్కింగ్ అధ్యక్షుడిగా కోవెలకుంట్ల పట్టణానికి చెందిన న్యాయవాది చిన్న హుస్సేన్ బాబును గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్‌బాజి ఆదేశాల మేరకు ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేడు తొళ్లమడుగులో వై ఏపీ నీడ్స్ జగన్

కొలిమిగుండ్ల: మండలంలోని తొళ్లమడుగు గ్రామ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి నిర్వహిస్తున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరై సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తారన్నారు. సచివాలయ పరిధిలోని నాలుగు గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయడం హర్షనీయం

కోవెలకుంట్ల: ఒప్పంద ఉ ద్యోగులు, అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడం హర్ష నీయమని ఆ సంఘం జేఏ సీ ఆర్థిక కార్యదర్శి అబ్దుల్ జబ్బార్ అన్నారు. గురువా రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 4వేల మంది ఒప్పంద అధ్యాపకుల ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. 20 ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న వారి కలను సీఎం నెరవేర్చారని పేర్కొన్నారు. ఈ మేరకు క్రమబద్ధీకరణకు సంబంధించిన నియమ నిబంధనల ఉత్తర్వులను ఇటీవల విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీ ణ్‌ప్రకాష్ విడుదల చేశారన్నారు. వీలైనంత త్వరలో రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టి అధ్యాపకులందరికీ పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. ఒప్పంద ఉద్యోగులు, అధ్యాపకుల సంఘం తరుపున సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అంబేడ్కర్ పేరుతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలి

కోవెలకుంట్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతో కోవెలకుంట్ల పట్టణంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని ఏపీ దళిత సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షుడు కృష్ణ ప్రేమ్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ పుష్పకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాల కోసం రాజ్యాంగాన్ని రచించి అందరి అభ్యున్నతికి కృషి చేసిన అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులువిజయ్‌కుమార్,కృష్ణ, పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత


నగదు అందజేస్తున్న నగర పంచాయతీ వైస్ చైర్మన్, వెల్ఫేర్ అసిస్టెంట్

బేతంచెర్ల: మండలపరిధిలోని బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన ఎల్ల శ్రీనివాసులు అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక మృతి చెందాడు. గురువారం గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ హరిత, వలంటీర్ సుగుణమ్మ ఆధ్వర్యంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ అంబాపురం మద్దయ్య చేతుల మీదుగా వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను మృతుని భార్య సుశీలమ్మకు అందజేశారు.

అసత్యారోపణలు... 'బీసీ' నైజం!

- మైనార్టీలను తప్పుదోవ పట్టించేకు కుట్రలు పన్నుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి
- షాధీఖానా నిర్మాణం విషయంలో వక్ఫ్‌బోర్డు అనుమతి తీసుకోనందునే కేసు నమోదు
- తనకెలాంటి సంబంధం లేదు.. దిగజారుడు రాజకీయాలు చేయను
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


కమ్యూనిటీ హాల్ నిర్మాణ విషయంలో గ్రామ పంచాయతీకి సమాచార హక్కు కింద మాజీ ఎమ్మెల్యే బీసీ స్వయంగా దరఖాస్తు చేసిన పత్రాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : అసత్యారోపణలు టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి నైజమని, మైనార్టీలను తప్పుదోవ పట్టించి రాజకీయ లబ్ధి కోసం కుట్రలు పన్నుతున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. షాదీఖానా నిర్మాణం విషయంలో వక్ఫ్‌బోర్డు అనుమతి తీసుకోనందునే సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు బీసీ జనార్ధన్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారని, తనకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన ప్రోద్బలంతోనే పోలీసులు నమోదు చేశానని బీసీ ఆరోపించడం తగదని, తాను హుందాగా రాజకీయం చేస్తానే తప్పా, దిగజారుడు రాజకీయాలు చేయనన్నారు. ఎమ్మెల్యే కాటసాని ఒత్తిడి మేరకు తనపై అక్రమ కేసులు బనాయించారని మాజీ ఎమ్మెల్యే బీసీ రెండు రోజుల క్రితం చేసిన ఆరోపణలపై గురువారం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది అబ్దుల్‌ఖైర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల టీడీపీ పాలనలో ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ షాదీఖానా భవనం నిర్మా ణం ఊసే ఎత్తని బీసీ జనార్ధన్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు ప్రేమ ఒలకబోస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో రాజకీయ లబ్ధి కోసం ముస్లిం సోదరులకు తన సొంత నిధుల తో షాదీఖానా నిర్మాణం చేపడుతున్నానంటున్నారే తప్పా... నిజంగా ముస్లింలపై అభిమానం ఉంటే ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏమి చేశారని నిలదీశారు. నీ హయాంలో ముస్లింల కోసం కనీసం ఒక్క మంచిపనైనా చేశావా అని కాటసాని ప్రశ్నించారు.

ఫిర్యాదు జరిగింది ఇలా...

బనగానపల్లెలో షాదీఖానా భవనం నిర్మాణం ప్రభుత్వ అనుమతి లేకుండా చేపట్టారని జిల్లా మైనార్టీ కార్పొరేషన్, వక్ఫ్‌బోర్డు కమిటీ వారు సాక్షాత్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు స్థానిక అధికారులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మాజీ ఎమ్మెల్యే బీసీ పై కేసు నమోదు చేశారని వివరించారు. ఇలా వాస్తవాలు ఉంటే.. కాటసాని ప్రమేయంతోనే తనను అరెస్టు చేశారని బీసీ జనార్ధన్‌రెడ్డి ఆరోపించడం హేయమని ఎమ్మెల్యే కాటసాని ఖండించారు. వాస్తవాలను ఎవ్వరూ మభ్యపెట్టలేరని, ఇప్పటికైనా అసత్యారోపణలు మానుకుని హుందాగా వ్యవహరించాలని సూచించారు.

సొంత నిధులతో షాదీఖానా నిర్మాణం ... ఓ రాజకీయ కుట్ర

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి సొంత నిధులతో బనగానపట్టణంలో షాదీఖానా భవన నిర్మాణం చేపట్టడం ఓ రాజకీయ కుట్ర అని ఎమ్మెల్యే కాటసాని విమర్శించారు. కేవలం ముస్లిం సింపతి కోసం నాటకాలు ఆడుతున్నారని, గతంలో ఎందుకు చేపట్టలేదని నిలదీశారు. ప్రైవేట్, ప్రభుత్వ స్థలాలే కాదు సొంత స్థలంలోనైనా ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే సంబంధిత గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోవాలన్న విషయం... సాక్షాత్తూ మాజీ ఎమ్మెల్యే బీసీకి తెయందంటే మనం నమ్మాలా అని ఎద్దేవా చేశారు. . ఇప్పటి వరకు కూడా మాజీ ఎమ్మెల్యే బీసీ షాదీఖానా నిర్మాణం విషయంలో వక్ఫ్ బోర్డు అధికారులకు దరఖాస్తు చేయకపోవడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం తప్పా... ముస్లింపై అభిమానంతో కాదనే విషయం అర్థమైందని, ఇప్పటికైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. ముస్లింపై ప్రేమ, అభిమానం ఉంటే ఇళ్ల పట్టాల పంపిణీపై కోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకోవాలని బీసీ జనార్ధన్‌రెడ్డికి సూచించారు.

షాదీఖానా నిర్మాణంపై... సమాచార హక్కు కింద వివరాలు అడగడం ఏమిటీ?

ముస్లిం సౌకర్యార్థం పట్టణంలో తాము చేపట్టిన షాదీఖానా నిర్మాణంపై సైతం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి విషం చిమ్ముతున్నారని ఎమ్మెల్యే కాటసాని ధ్వజమెత్తారు. ప్రజలకు మంచి జరుగుతుంటే సంతోషించాలే తప్పా... ఏ కమ్యూనిటీకి చెందిన కమ్యూనిటీ హాల్ కడుతున్నారు... తదతర వివరాలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద స్వయంగా మాజీ ఎమ్మెల్యే బీసీ దరఖాస్తు చేసిన తీరు మైనార్టీలపై ప్రేమ ఏంటో తెలిసిపోయిందన్నారు. ముస్లిం సమస్యలను గుర్తించి రూ. 1.20 కోట్లతో తాము షాదీఖానా నిర్మాణం చేపట్టామని, తనకు మంచిపేరు వస్తుందని ఓర్వలేక బీసీ సైకోలా వ్యవహరిస్తున్నారని కాటసాని విమర్శించారు. అభివృద్ధి పనులు చేపట్టడంతో పోటీ పడాలే తప్పా.. ప్రజలకు జరిగే మంచిని ఓర్వలేకపోతే ఫలితం చవి చూడాల్సి వస్తుందని ఈ సందర్భంగా కాటసాని హెచ్చరించారు. కార్యక్రమంలో షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌తాహెర్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, మహబూబ్‌వలి, అబ్దుల్‌ఫైజ్, మాలి, సజ్జాద్, హైదర్, గౌస్, ఆర్యవైశ్య సంఘం నాయకులు నూకల వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు పంపిణీ

డోన్ రూరల్ : ఆడుదాం ఆంధ్రా క్రీడల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా వస్తువులను ఎంపీడీఓ శ్రీనివాసులు మండల స్థాయి అధికారులకు అందచేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు, పీఈటీలకు క్రీడా వస్తువులను అందచేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 15వ తేదీన జరగాల్సిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు 26వ తేదీకి వాయిదా పడిందన్నారు. క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుధీర్, మండల స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాటసానికి వీఆర్‌ఏల వినతి

బనగానపల్లె రూరల్: వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ జిల్లా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షులు నాగేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వీఆర్‌ఓలు వినతి పత్రం అందజేశారు. గురువారం పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేను వీఆర్‌ఏ సంఘం కలిసి తమ సమస్యలను విన్నవించారు. క్యాబినెట్ సమావేశంలో వీఆర్‌ఏల డిమాండ్ల పరిష్కారించే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తమ డిమాండ్ల తీసుకెళ్లాలని వారు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కోరారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి

కొలిమిగుండ్ల : ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలని ఏఈ ప్రసన్న ఆంజనేయులు సూచించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులకు విద్యుత్ పొదుపు అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహబహుతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ అవసరం ఉన్న మేరకు ఇళ్లు, కార్యాలయాలు తదితర చోట్ల విద్యుత్ ఉపయోగించుకునేందుకు సహకరించాలన్నారు. విద్యుత్ చార్జీలు ఎక్కువగా రాకుండా ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ తదితర నాయకులు

ప్యాపిలి: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా మల్లికార్జునరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని జక్కసానికుంట్లలో గురువారం పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ జయమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా రోగుల ఇంటి వద్దనే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందజేయడంతోపాటు దిగుబడులు అమ్ముకునే వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని గుర్తు చేశారు. అదేవిధంగా విద్యాభివృద్ధికి అమ్మఒడితోపాటు విద్యా, వసతి దీవెనలను ప్రభుత్వం అమలు చేస్తుందని వివరించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని వారు కోరారు. కార్యక్రమంలో నల్లమేకలపల్లి సర్పంచ్ సంధ్యారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయ మనోజ్‌రెడ్డి, అశోక్, రామకృష్ణారెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


సంక్షేమ పథకాలబ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. బనగానపల్లె పట్టణం నాల్గవ సచివాలయం పరిధిలోని గురువారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగు స్తంభాల మండపం నుంచి కరణం మొహిద్దీన్ కాలనీ, మంగళవారంపేట, ఎస్సీ కాలనీ, పెద్దపీర్లచావిడి, మర్కస్ మసీద్ ఏరియాల్లో ముస్లిం షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, సర్పంచ్ ఈసారి యల్లమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీ సుబ్బమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ తదితరులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని, తమకు మాత్రం ఇవ్వడం లేదని.. చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పట్టణంలో మూడువేల మంది ప్రేద ప్రజలకు ఇళ్ల స్థలాలను పంపిణీకి చర్యలు తీసుకున్నామని, అయితే టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి కోర్టు ద్వారా అడ్డుకున్నారన్నారు. బీసీ అడ్డుకట్ట వేయకుంటే ఇంటి స్థలంతో పాటు ఇళ్లు కూడా పూర్తయ్యేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినా ఆందోళన చెందొద్దని, త్వరలోనే కోర్టులోనే సమస్య పరిష్కారం అవుతుందని, వెంటనే ఇంటి పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాటసాని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఆర్ఐ రాఘవేంద్ర ప్రసాద్,పీఆర్ఏఈ మహేష్,హౌసింగ్ ఏఈ బాల చంద్రుడు, ఆర్‌డబ్ల్యూఎస్ సాయి కృష్ణ,విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీఓ స్వరూప పట్టణ ఈఓ ఖాలీల్,ఎంపీటీసీ సభ్యులు తాహీర్,వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, అబ్దుల్‌ఫైజ్, నూకల వెంకటసుబ్బయ్య, వేనుగోపాల్, డాక్టర్ రవికుమార్, నారాయణ ప్రసాద్, బానుముక్కల సహకారం సంఘం చైర్మన్ నీలీ శ్రీనివాసులు,కిశోర్, సాదక్ హుస్సేన్, సజ్జాద్, మహబూబ్‌వలి, రహీమాన్, ఖాలీల్,గొండవలి,జీటి వెంకట్రామిరెడ్డి సయ్యద్, తెలుగుపేట మద్దయ్య మరికొందరు వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామానికి ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరెంట్ బిల్లు చేసే పనిపై వెళ్లిన తనను వడ్డె రాజశేఖర్ దుర్భాషలాడుతూ కొట్టాడన్న పరదేశి అనే వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అవుకు పోలీస్ స్టేషన్‌లో 13న వడ్డె రాజశేఖర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీంతో మనస్థాపానికి గురైన రాజశేఖర్ సూపర్ వాస్మోలా తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన బంధువులు వెంటనే బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారని బంధువులు తెలిపారు.

ప్రశాంతంగా షీప్ సొసైటీ ఎన్నికలు


డిక్లరేషన్ పత్రాలు అందజేస్తున్న ఎలక్షన్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి

అవుకు: మండల కేంద్రం అవుకు పట్టణానికి చెందిన శ్రీ రాధాకృష్ణ గొర్రెల పెంపకదారుల సహకార సంఘం ఎన్నికలు ఎలక్షన్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి నిర్వహించారు. సభ్యులు గందరగోళం సృష్టిస్తున్న నేపథ్యంలో పోలీసులు కలుగజేసుకొని ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాధాకృష్ణ సంఘానికి సంబంధించి 72 మంది సభ్యులు ఎన్నికలకు హాజరయ్యారు. కార్యవర్గ సభ్యులుగా 17 మంది నామినేషన్లు వేశారు. ఒకరు విత్ డ్రా చేసుకోగా 16 మందికి చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహించగా 7మంది నాలుగు ఓట్లతో గెలుపొందారని డాక్టర్ పద్మావతి తెలిపార. మాయలూరి మద్దయ్య సంఘం అధ్యక్షులుగా, ఎర్రప్పగారి మద్దిలేటి ఉపాధ్యక్షులుగా, శ్రీనివాసులు, ఆదిమద్దిలేటి స్వామి, చంద్రశేఖర్, సురేంద్రకుమార్, ఘన మద్దిలేటిలు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. వారికి ఎలక్షన్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, స్థానిక డాక్టర్ భారతీదేవి డిక్లరేషన్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ తస్లీమా నసీరూన్, ఎల్ఎస్ఏ రాజేష్, ఏహెచ్ఏలు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే అసత్యారోపణలు

- మంత్రి బుగ్గనపై ధర్మవరం సుబ్బారెడ్డి ఆరోపణలు అర్థరహితం
- రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు


మాట్లాడుతున్న రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్ : నియోజకవర్గంలో తన ఓటమి ఖాయం అనే భయంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో పాటు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై అసత్యారోపణలు చేస్తున్నారని రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు విమర్శించారు. గురువారం ఆర్థిక మంత్రి బుగ్గన స్వగృహంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీరాములు మాట్లాడారు. తమ సమస్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలు మంత్రికి వినతి పత్రం అందజేసే సందర్భంలో అసందర్భ వ్యాఖ్యలు చేసారని ధర్మవరం సుబ్బారెడ్డి దుష్ప్రచారం చేయడం తగదన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కన్నా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీల వేతనాలు మెరుగుపడిన విషయం తెలుసుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను గుర్రాలతో తొక్కించిన ఘనత టీడీపీ అధినేతదే అన్న సంగతి సుబ్బారెడ్డి గుర్తుంచుకోవాలన్నారు.

రోజుకో వర్గం చేరిన ధర్మవరం

రోజుకో పార్టీ, పూటకో వర్గంలో చేరి కోట్ల,కేఈ కుటుంబాలను నమ్మించి నట్టేటముంచిన చరిత్ర సుబ్బారెడ్డిదేనన్న సంగతి నియోజకవర్గ ప్రజలందరికి తెలుసున్నారు. రెండు ప్రధానవర్గాల్లో తాను రాజకీయంగా ఎదిగేందుకు బీసీలతో పాటు ఇతరులను అణగదొక్కిన ఘనత ఆయనదే అని ఎద్దేవా చేశారు. నాటు సారా వ్యాపారంలో పోలీసులకు పట్టుబడి జైలుకెళ్లిన ఘనత సుబ్బారెడ్డికే దక్కుతోందన్నారు. సమ్మె చేయడం... హక్కుల కోసం పోరాడడం అంగన్‌వాడీ కార్యకర్తల ప్రాథమిక హక్కు అని, ప్రభుత్వం చర్చల ద్వారా వారి సమస్యలను పరిష్కరిస్తుందని మంత్రి హామీ ఇస్తే వక్రీకరించి నిందించడం దారుణం అన్నారు. కనీసం సర్పంచ్‌గా కూడా గెలువని సుబ్బారెడ్డి... ఏకంగా మంత్రిపై తేల్చుకుందారా అంటూ కయ్యానికి కాలుదువ్వడం మూర్ఖత్వానికి సాక్ష్యం అని, సుబ్బారెడ్డి నైజం నియోజకవర్గ ప్రజలందరికి తెలిసిపోయిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఆర్ట్ రమణ,గొల్ల వెంకట్రాముడులు పాల్గొన్నారు.

మంత్రికి వినతిపత్రం అందజేసిన అంగన్‌వాడీలు


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

డోన్: తమ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. పట్టణంలోని తన స్వగృహంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రంగనాయుడు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంత్రికి తమ సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ కార్యకర్తల శిబిరానికి మంత్రి చేరుకొని అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వర్గంలో చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తామని ఆయన హామీనిచ్చి ఆందోళన విరమించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శివరాం, నక్కి శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అలేబాదులో గడ్డివాము దగ్ధం

ప్యాపిలి: మండల పరిధిలోని అలేబాదు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డివాము దగ్ధమైంది. గ్రామ శివారులో భూపాల్ అనే రైతు తన కల్లెం దొడ్డిలో మూడు ట్రాక్టర్ల వరి గడ్డివాము వేశాడు. రాత్రి అకస్మాత్తుగా గడ్డివాము నుంచి మంటలు రావడాన్ని చూసిన స్థానికులు వాటిని ఆర్పే ప్రయత్నం చేశారు. డోన్ నుంచి వచ్చిన అగ్నిమాపక యంత్రం కూడా మంటలు ఆరిఏంది. అప్పటికే మంటలు పూర్తిగా వ్యాపించడంతో గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

జిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలుగా గుండా సుప్రజ


సుప్రజకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : నంద్యాల జిల్లా ఆర్య వైశ్య మహిళా మండలి అధ్యక్షురాలుగా గుండా సుప్రజ ఏకగ్రీవంగా ఎన్నికైంది. గురువారం కర్నూలులో రాష్ట్ర ఆర్యవైశ్యసంఘం నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా మండలి నూతన అధ్యక్ష ఎంపిక కార్యక్రమంలో బనగానపల్లెకు చెందిన గుండా సుప్రజను మహిళా సంఘం సభ్యులు నంద్యాల జిల్లా మహిళా మండలి అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. ఈ మేరకు బనగానపల్లెలో గుండా సుప్రజకు ఆర్యవైశ్యులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక ఆర్యవైశ్య భవనం నుంచి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆస్థానం మీదుగా ఊరేగింపు నిర్వహిస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీరామవెంకట సుబ్రమణ్యం, గౌరవ సలహాదారులు గుండా సుబ్రహ్మణ్యం, గుండా శ్రీనివాసులు, వేనుగోపాల్, గుండా తదితరులు పాల్గొన్నారు.

రావుబహదూర్ బీపీ శేషారెడ్డి సేవలు ఆదర్శం


బేతంచెర్లలో శేషారెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బేతంచెర్ల : దివంగత రావుబహదూర్ బీపీ శేషారెడ్డి విద్య, వైద్య, ఆత్మాధ్మిక రంగాలకు తోడ్పాటును అందించి అందరికి ఆదర్శంగా నిలిచారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరక్టర్ ముర్తుజావలి అన్నారు. గురువారం స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో శేషారెడ్డి 50వ వర్ధంతి వేడుకలను హైస్కూలు హెచ్ఎం అబ్రహ్మం, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. శేషారెడ్డి విగ్రహానికి, చిత్రపటానికి ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నంద్యాల క్రాస్ రోడ్డులోని శేషారెడ్డి విగ్రహం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ, చైర్మన్ మాట్లాడుతూ ప్రజా సేవ బాధ్యతగా తీసుకొని బేతంచెర్లలో శేషారెడ్డి హైస్కూలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువుల ఆసుపత్రి నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవడము జరిగిందన్నారు. 1954నుండి1959 వరకు డోన్ ఎమ్మెల్యేగా, 1965 నందు పాకిస్థాన్ యుద్ధకాలంలో ఆంధ్ర ప్రదేశ్ రక్షణ కమిటీ నందు రాయలసీమ ఏకైక ప్రతినిధిగాను, 1970 భారతీయ విద్యాభవన్ కేంద్ర కమిటీలో మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహరావుతో కలిసి సభ్యులుగా కొనసాగి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సేవలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, నాయకులు దస్తగిరి, నాగేశ్వర్‌రెడ్డి, నిరంజన్, శేఖరయ్య, ఖాజా,సలీమ్, తిరుమలేశ్వర్‌రెడ్డి, రంగస్వామి, భాస్కర్, వలీబాషా పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అపోహలు వీడాలి


మాట్లాడుతున్న ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్

డోన్ : ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు డోన్ ప్రభుత్వాసుపత్రిలో సిబ్బందికి రెండురోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేశారు. ముగింపు సందర్భంగా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అపోహలు వీడాలని సూచించారు. ఇప్పటి నుండి ఎయిడ్స్ రోగులు ఎవ్వరూ మందుల కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సినవసరం ఉండదన్నారు. హెచ్‌ఐవీ పట్ల ప్రజల్లో అనేక అనుమానాలు, అపోహలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సినవసరం వైద్యసిబ్బంది, స్వచ్ఛంద సంస్థలపై ఉందన్నారు. ప్రోగ్రాం అధికారి అలీ హైదర్ హెచ్‌ఐవీ రోగులకు కౌన్సెలింగ్ ఇచ్చే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు శశికుమార్ రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ప్రభ, నళిని, ఏఆర్‌టీ డాక్టర్ రాధిక, హ్యాండ్ స్వచ్ఛం సంస్థ, షేరిండియా సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.